# ఇన్లాండ్ లెటర్ కథలు

## పెద్దమనసు

రవి ఓ పదేళ్ళ కుర్రాడు. మిట్ట మధ్యాహ్నం ఎండ నడినెత్తి మీదకు వస్తోంది. అయినా ఆ ఎండలోనే బ్రష్ పాలిష్ పట్టుకుని కూర్చుని వున్నాడు. ప్రక్కనే వున్న చెట్టుకి తన అవిటితనానికి గుర్తుగా వున్న కర్రని ఆన్చిపెట్టాడు. అతనికి చిన్నతనంలోనే తండ్రి పోయాడు. ఉన్న అమ్మ రోగంతో మంచాన పడడంతో పదేళ్ళ వయసులోనే సంపాదనకు దిగాడు. 'పాలిష్ బాబూ!పాలిష్!' అంటూ ఆశగా ఏ పాదాలు నడచి వస్తాయా! అని ఎదురుచూస్తుంటాడు. కడుపునిండా తిని ఎన్నిరోజులైందో లెక్కవేసుకొనే ఓపిక కూడా లేదు. ఇంతలో కారు ఒకటి వచ్చి అతని ముందు ఆగింది. కారులోంచి సూటు, బూటు వేసుకున్న వ్యక్తి రవి ఎదుట నిల్చొని కాలు ముందుకు పెట్టి 'పాలిష్' అని దర్పంగా అన్నాడు.

రవి ఆనందంతో అతని బూట్లకు పాలిష్ వేశాడు. అతడి శ్రమంతా బూట్లపై తళతళా మెరిసింది. ఆ పెద్ద మనిషి ఎడం చేత్తో విలాసంగా సిగరెట్ కాలుస్తూ, కుడిచేత్తో కోటు జేబులోంచి వందనోటు తీసి ఇచ్చాడు. అంత పెద్దనోటుని రవి తన జీవితంలో ఇంత దగ్గరగా చూడడం అదే ప్రథమం. ఆ నోటుని అందుకోవడానికి సంశయిస్తూ 'బాబుగారూ! చిల్లర లేదండీ!అన్నాడు. ఆ వ్యక్తి "ఫర్వాలేదు వుంచుకో!" అంటూ కారెక్కాడు. ఆశ్చర్యం 'నుంచి తేరుకునే ముందే కారు సర్రున దూసుకెళ్ళింది. రవి ఆనందానికి హద్దులు లేవు. ఆకలి తీర్చుకోవాలని, అమ్మకు మందులు కొనిపెట్టాలని పెటపెటలాడుతున్న వచ్చనోటు రవిలో ఆశలకు లెక్కలేసింది. ఆ వ్యక్తి మనుషుల్లో దేవుడని అనుకున్నాడు రవి. ముందు హోటల్ కెళ్ళి కడుపునిండా తినాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా సమీపంలోని హోటల్‌లో అడుగు పెట్టాడు. రవి



చింకిపాత లాగూ, అతుకుల చొక్కా, రేగిన జుట్టును చూసిన హోటల్ మేనేజర్ అనుమానంగా చూస్తూ 'డబ్బులున్నాయా?' అని అడిగాడు. వాడు గర్వంతో తన వద్దవున్న వంద నోటుని చూపించాడు. ఆ నోటుని పరీక్షగా చూసిన మేనేజర్ 'ఏరా కుంటి వెధవా! దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నావా? పోలీసులకు పట్టిస్తాను, బయటికి పో! అంటూ కోపంతో గద్దించాడు. రవి ఏడుస్తూ ఆనోటుని చించిపారేశాడు. జరిగిన మోసాన్ని ఆ చిన్ని హృదయం తట్టుకోలేకపోయింది. వందనోటు ఇవ్వగానే ఆ పెద్ద మనసుని ఆభివందించాడు. ఇప్పడేమైంది మరి!తనకి కాలు అవుడు. వాడికి బుద్ధి అవుడు. అడుగడుగునా అందరినీ మోసం చేస్తూ గతికే, బ్రతికే బుద్ధిహీనుడు వాడు. మరోసారి ఇలా మోసపోకూడదు! అనుకుంటూ భారంగా ఇంటివైపు నడవసాగాడు రవి

—ఎం. రామశేషు,

బంజారాహిల్స్.

## బ్లెస్సింగ్ ఇన్ డిస్గైస్



తల వేయి ముక్కలైన భావన కలుగుతోంది సీతకి ఇరుగు పొరుగు వాళ్ళ మాటలు వింటుంటే. అవమానం గొడ్రాలు, గొడ్రాలు అని ముఖం మీదనే అంటుంటే సీత ఏమీ అనలేక తనలో తానే కుమిలిపోతోంది. ఆ కాలనీకి సీత, రఘు దంపతులు వచ్చి దాదాపు ఆరు సంవత్సరాలైంది. ఆమె చేయని వ్రతం లేదు, నోచని నోము ఎందరో దేవుళ్ళకి మొక్కుకుంది. ఎందరో స్వాములకు కానుకలు సమర్పించుకుంది. అయినా ఫలితం లేదు రఘు మాత్రం రోజూ ఉదయం 9 గంటలకే ఆఫీసుకి వెళ్ళిపోవడం వల్ల అతనికి ఈ ఇరుగు పొరుగు వుల్ల విరుపు మాటలు, సంతాన సోమిదమ్మల వ్యాఖ్యానాలు చెవినపడే అవకాశం లేదు. పాపం సీత గృహలక్ష్మిలా ఇంట్లోనే వుంటుంది. వాళ్ళ మాటలు భరించలేక కుమిలిపోతూ భర్త చెవిన వేస్తూనే వుంటుంది కాని అతడు విని బాధ పడడం తప్ప ఏమీ చేయడు.

ఓ రోజు ఎదురింట్లో బారసాల జరుగుతోంది. అందరినీ పిలిచారు కాని సీతను పిలవలేదు. పక్కవాటాల వాళ్ళను పిలిచి తనను పిలవకపోవడంతో కారణం ఏమైవుంటుందో ఊహించిన సీత మనసు గాయపడింది. తనను పిలవడం అశుభం అని భావించారేమో! అసలు తనకే ఎవరితో మాట్లాడాలని కానీ, ఏ ఫంక్షన్లకు వెళ్ళాలని కానీ ఆసక్తి వుండడం లేదు. ఎక్కడికైనా రొటీన్ ప్రశ్నావళి. ఏదో కారణం చెప్పడం. అసలు మన స్వవిషయాలపై ఇతరులకు అంత ఆసక్తి ఎందుకు? ఎవరి బ్రతుకు వారిది. సంఘజీవులం కాబట్టి పండుగలకు, పబ్బాలకు కలుసుకుంటాం. ఎదురెదురుగా వుంటాం కాబట్టి రోజూ ముఖం చూసుకోవాల్సి వుంటుంది. ఆచార సంప్రదాయాలు అనుసరించేటప్పుడు కనీస మర్యాదలు పాటించడం అభిలషణీయం.మరి ఎదురుగా వుంటూ కూడా తనను పిలవకపోవడం సీత మనసును గాయపరిచింది. ఇక లాభంలేదు. భర్తతో చెప్పాలి. ఇక్కడకు దూరంగా మరెక్కడైనా వెళ్ళి మనశ్శాంతి వెదుక్కోవాలి. ఈ కుసంస్కారులకి దూరంగావుంటే అదే తనకు మనశ్శాంతి. సమయం ఐదున్నర కావొస్తున్నా రఘు ఎంతకీ రాకపోవడంతో తనకి చిరాగ్గా వుంది. ఆరు గంటలకు వచ్చాడు రఘు. వస్తూనే కుర్చీలో కూలబడ్డాడు. 'సారీ! సీతా !నాకు విశాఖపట్టణం ట్రాన్స్‌ఫరయింది. మూడ్రోజులే టైమిచ్చారు జాయినవ్వడానికి అంటూ విచార వదనంతో అన్నాడు. ఈ మాట ఇంత చిన్నగా అంటారేమిటండీ! అది నాకు శుభవార్త. ఇక్కడ వుండడం నరకంగా వుంది. ఇప్పడీ వార్త నాకు 'కారుచీకట్లో కాంతిరేఖ' లాంటిది. పదండి టైమవుతోంది. సిద్ధమౌతాం! అంది రఘుకు మరో మాట మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా!

— అనితశ్రీ, భివాండి.